క్లుప్తంగా

14న సర్వసభ్య సమావేశం

యాలాల: ఈ నెల 14న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పుష్పలీల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ హాలులో ఎంపీపీ బాలేశ్వర్‌గుప్తా అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమీక్ష ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలని వెల్లడించారు.

ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా బాలేశ్వర్‌గుప్తా



నియామక పత్రం అందుకుంటున్న గుప్తా

యాలాల: ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శిగా యాలాల ఎంపీపీ తాళ్లపల్లి బాలేశ్వర్ గుప్తా ఎన్నికయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరావది లక్ష్మీనారాయణ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా గుప్తా మాట్లాడారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో కార్యదర్శిగా ఎంపిక చేసిన రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు.

శ్మశానవాటిక నిర్మించాలి



ప్రొసిడింగ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పూడూరు: శ్మశానవాటికకు స్థలం కేటాయించి, ప్రహరీ నిర్మించాలని కోరుతూ నిజాంపేట్‌మేడిపల్లి గ్రామానికి చెందిన పలువురు ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. గ్రామంలో శ్మశానవాటిక స్థలం లేక ఇబ్బంది పడుతున్నామని, సమస్య పరిష్కరించాలని కోరగా.. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అనంతరం ప్రహరీ నిర్మాణానికి రూ.4 లక్షల ప్రొసిడింగ్ కాపీ అందజేశారు. కృషిరత్న అవార్డు గ్రహీత నర్సింహ, శంషు, వినయ్‌రెడ్డి, ముస్తఫా, అన్వర్, అలీం, అయూబ్, హైమద్, యూసుఫ్, ఖాదర్, నజీర్, నవాజ్, షకీల్, జహంగీర్ పాల్గొన్నారు.

ఆలయంలో అన్నదానం



భోజనం చేస్తున్న భక్తులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణం పాతగంజ్ హనుమాన్ మందిరంలో ప్రతి శనివారం దాతల సహాయంతో అన్నదానం చేస్తున్నారు. 15 నెలలుగా మధ్యాహ్నం 12.30గంటల నుంచి 1.30గంట వరకు కార్యక్రమం నిర్విరామంగా కొనసాగుతోంది. భక్తుల కోరిక మేరకు ఈ మహాదానం కొనసాగుతుందని అర్చకులు రవీందర్ శర్మ తెలిపారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

కుల్కచర్ల: మన సంస్కృతి, సంప్రదాయాలను మనమే పరిరక్షించుకోవాలని జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్ అన్నారు. శనివారం చౌడాపూర్ మండలం మక్తవెంకటాపూర్‌లో నిర్మిస్తున్న శ్రీసంత్ సేవాలాల్ ఆలయ నిర్మాణానికి రూ.25వేలు విరాళంగా వారు అందజేసి మాట్లాడారు. ప్రతి ఒక్కరు సేవాభావంతో మెలగాలని సూచించారు. నాయకులు వెంకట్, నీల్యానాయక్, బద్రీ నాయక్, అశోక్, గాంగ్యా, పర్గి అశోక్, మొగులయ్య, మహేశ్ కుమార్ పాల్గొన్నారు.

కాలనీలను పరిశుభ్రంగా ఉంచాలి

పరిగి: కాలనీలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణ కేంద్రంలోని పలు కాలనీల్లో పర్యటించి పారిశుద్ధ్య నిర్వహణపై కార్మికులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎక్కడ చెత్త చెదారం లేకుండా శుభ్రం చేయాలని చెప్పారు. సీజనల్ వ్యాధుల కాలం కనుక.. ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ప్రజలు చెత్తను వీధులు, రోడ్లలో వేయవద్దని కోరారు. కాలనీల్లో ఎక్కడ ఎలాంటి సమస్యలు ఉన్నా.. తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు.



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న చైర్మన్

వెట్టి చాకిరీ చేస్తున్నాం..

- కనీస వేతనంతో పాటు.. ఉద్యోగ భద్రత కల్పించాలి
- అర్హతను బట్టి పదోన్నతి కల్పించాలి
- నిరవధిక సమ్మెలో పంచాయతీ కార్మికుల డిమాండ్
- గ్రామాల్లో విధుల బహిష్కరణ
- పారిశుద్ధ్య నిర్వహణపై ప్రభావం



దౌల్తాబాద్‌లో సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు

దౌల్తాబాద్: 'వెట్టి చాకిరీ చేస్తున్నాం. అరకొర జీతంతో కాలమెల్లదీస్తున్నాం. రోజురోజుకూ నిత్యావసర ధరలు పెరిగిపోతున్నాయి. కనీస అవసరాలు తీర్చుకోలేని దుస్థితో ఉన్నాము' అని పంచాయతీ కార్మికులు వాపోయారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 6 నుంచి జీపీ కార్మికులు సమ్మెబాట పట్టిన విషయం విధితమే. ఇందులో భాగంగా మూడో రోజుకు చేరుకున్న నిరసనలో కార్మికులు మాట్లాడారు. రేయనకా పగలనకా వీధులను శుభ్రం చేయడమే కాకుండా.. జీపీ పరిధిలో అధికారులు చెప్పిన అన్ని పనులు చేస్తూ.. గ్రామాలను శుభ్రంగా ఉంచుతున్నాని తెలిపారు. ఏనాటికైనా తమను ప్రభుత్వం గుర్తించి శాశ్వత ఉద్యోగులుగా మార్చి వేతనం పెంచుతుందని ఆశతో ఉన్నామని, పలుమార్లు సంబంధిత అధికారుల ఎదుట తమ సమస్యలు విన్నవించామని చెప్పారు. కానీ తమను సర్కార్ పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కనీసం వేతనం అమలు చేయడంతో పాటు.. అర్హతను బట్టి పదోన్నతులు కల్పించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా.. సమస్యల సాధనకోసం కార్మికులు.. విధులు బహిష్కరించడంతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తనుంది. అసలే వర్షాకాలం.. ఆపై సీజనల్ వ్యాధులు ముసిరే ప్రమాదం లేకపోలేదు. పారిశుద్ధ్య కార్మికుల సమ్మె వలన ఎలాంటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

కీలకమైన పనుల్లో

జిల్లాలో కార్మికులు 1,870 మంది పనిచేస్తున్నారు. పెద్ద జీపీల్లో పది నుంచి 15 మంది, చిన్న జీపీల్లో నలుగురు నుంచి ఆరుగురు విధులు నిర్వహిస్తున్నారు. వీరిని మల్టీపర్పస్ వర్కర్లుగా పేర్కొంటూ పని చేయించుకుంటున్నారు. చెత్త తొలగింపు, డ్రైనేజీల నిర్వహణ, హరితహారం మొక్కలు, ప్రభుత్వ పాఠశాల పరిశుభ్రత, ఇంటింటికీ చెత్త సేకరణ, విద్యుద్దీపాలు, తాగునీటి సరఫరా లాంటి విధులు నిర్వహిస్తున్నారు.

డిమాండ్లు..

కార్మికులు, సిబ్బందిని రెగ్యులరైజ్ చేయాలి. ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ట్రెజరీ ద్వారా వేతనాలు ఇవ్వాలి. పీఆర్సీలో నిర్ణయించిన ప్రకారం నెలకు రూ.19వేల వేతనం చెల్లించాలి. కారోబార్ బిల్‌కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలి. జీఓ 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలి. విధి నిర్వాహణలో మరణించిన వారి కుటుంబాలకు రూ.10లక్షల బీమా ఇవ్వాలి. వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలి. 8గంటల పనిదినాలు అమలు చేయాలి. పండుగ, వారాంతపు సెలవు, ఆర్జిత సెలవులు అమలు చేయాలి.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్పలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నుంచి పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు కార్మికులు ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం వారు మాట్లాడారు. పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. శాంతమ్మ, వెంకటమ్మ, శ్యామప్ప, అంబరప్ప, నర్సింహులు, జగన్, రాములు ఉన్నారు.

శ్రమ దోపిడీ..

పరిగి: కార్మికుల శ్రమను ప్రభుత్వం దోచుకుంటుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ ఆరోపించారు. కార్మికుల సమ్మె మూడో రోజుకు చేరుకున్న సందర్భంగా.. మండల పరిషత్ కార్యాలయం ఎదుట చేస్తున్న దీక్షలో.. కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. కార్మికులు లేనిదే ఏ గ్రామం లేదని, వారి సమస్యలను పరిష్కరించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



పూడూరు: ఒంటి కాలిపై కార్మికుల నిరసన

మల్టీపర్పస్‌ను రద్దుచేయాలి

పూడూరు: గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. జీపీ కార్మికులు చేస్తున్న సమ్మె శనివారం నాటికి మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మెలో కార్మికులు ఒంటి కాలిపై నిరసన వ్యక్తం చేశారు. సమ్మెకు మద్దతు తెలిపుతూ రామకృష్ణ మాట్లాడారు. జీపీల్లో మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కనీస వేతనం 19,500 పెంచడంతో పాటు అర్హులందరినీ శాశ్వత ఉద్యోగులుగా గుర్తించి, పదోన్నతులు కల్పించాలని కోరారు. నిరసనలో కార్మికులు ముజాహిద్, బందయ్య, వెంకటయ్య, నాగరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

హర్షణీయం

కుల్కచర్ల: గుండెపోటుతో అకాల మరణం పొందిన గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ చైర్మన్ సాయిచంద్ భార్యకు.. భర్త బాధ్యతలను (ఆ శాఖ చైర్ పర్సన్ పదవిని) రాష్ట్ర ప్రభుత్వం అప్పగించడం హర్షణీయమని జెడ్పీటీసీ రాందాస్ నాయక్, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి మందిపల్ వెంకట్‌లు అన్నారు. ఈ మేరకు శనివారం వారు మాట్లాడారు. బడుగుబలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ పాటుపడుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు అశోక్, రవి, తిమ్యా, పర్గి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఠాణాను సందర్శించిన సీఐ

బంట్వారం: నూతనంగా బాధ్యతలు చేపట్టిన ధారూరు సీఐ రామకృష్ణ శనివారం బంట్వారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. శాంతి భద్రతలను పరిరక్షిస్తూనే.. నేరాలను అదుపు చేయాలని సూచించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో విలేజ్ పోలీస్ ఆఫీసర్ సిస్టంతో తగిన సమాచారం సేకరించాలన్నారు.

ఆర్థిక సహాయం

కుల్కచర్ల: అంతారం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు శివానంద్ తల్లి చంద్రకళ శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి స్థానిక నేతలతో తక్షణ ఆర్థిక సహాయంగా రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు చంద్రమౌళి, మొగులయ్య, రాములు, పాండు, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

జనం మెచ్చిన నేత వైఎస్సార్

- పేదల జీవితాల్లో వెలుగు నింపిన మహనీయుడు
- ఆరోగ్యశ్రీతో ఆయన సేవలు చిరస్మరణీయం
- వైఎస్సార్ జయంతిలో కాంగ్రెస్, వైఎస్సార్‌టీపీ నేతలు



కుల్కచర్లలో..



కొడంగల్ రూరల్‌లో..

పరిగి: 'జనం మెచ్చిన నేత. సకల జనుల గుండెల్లో గూడుకట్టుకున్న మహనీయుడు. రైతు బాంధవుడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి' అని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్లు కోళ్ల యాదయ్య, నరేందర్, కాంగ్రెస్ నాయకులు అన్నారు. దివంగత నేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి సందర్భంగా శనివారం ఇరు పార్టీల నేతలు ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. వైఎస్సార్ హయాంలో రైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలయ్యాయని, సకల జనులకు రాజీవ్ ఆరోగ్యశ్రీ తదితర పథకాలను అమలు చేసి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, వైఎస్సార్‌టీపీ నాయకుల పాల్గొన్నారు.

మహానేతకు ఘననివాళి

కుల్కచర్ల: వైఎస్సార్ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి మాట్లాడారు. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన మహానేత వైఎస్ అని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, బ్లాక్‌టు అధ్యక్షుడు భరత్‌కుమార్, ఎంపీటీసీ ఆనందం, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మండల మాజీ అధ్యక్షుడు వెంకటయ్య, రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, భాస్కర్, నూరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిట దేవుడు

బంట్వారం: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేదల పాలిట దేవుడని ఆయన అభిమాని సుజాత అన్నారు. వైఎస్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. రాజశేఖర్‌రెడ్డి పాదయాత్ర సమయంలో తాండూరు నుంచి వస్తూ.. ఓగులాపూర్ గేటు వద్ద పూరి గుడిసెలోని తన హోటల్ వద్ద ఆగి పాలు తాగారని, నాడు అక్కున చేర్చుకుని యోగ క్షేమాలు తెలుసుకున్నారని గుర్తుచేశారు. ఆయన సీఎం అయ్యాక రూ.25 వేలు ఆర్థిక సాయం చేశారని ఆమె చెప్పారు.

కొడంగల్ రూరల్‌లో..

కొడంగల్ రూరల్: వైఎస్సార్ జయంతి సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వైఎస్సార్‌టీపీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. పార్టీ మండల అధ్యక్షుడు, నాయకులు అన్నారం సాయిలు, శివానంద్, మల్లప్ప, ఇస్మాయిల్, నవీన్, కృష్ణ, రాజు, రాజు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



పరిగి: వైఎస్సార్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న వైఎస్సార్‌టీపీ నేతలు



దోమ: దాదాపూర్‌లో వైఎస్‌ఆర్‌టీపీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు వెంకటేశ్

చినుకు పడితే చిత్తడే..



బస్టాండు బయటే నిలిచిన ఆర్టీసీ బస్సు

ధారూరు: చినుకు పడితే చాలు.. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ మొత్తం బురదమయంగా మారుతోంది. ఫలింతంగా బస్సులు లోపలికి వచ్చే వీలు లేకుండా పోతోంది. శనివారం కురిసిన వర్షానికి బస్టాండ్ ఆవరణ చిత్తడిగా మారడంతో బస్సులు రోడ్డుమీదే ఆగి వెళ్తున్నాయి. దీంతో ప్రయాణికులు రహదారిపై నిరీక్షించాల్సి వచ్చింది. బస్టాండ్ లోతట్టు ప్రాంతంలో ఉండడంతో.. వర్షాలు పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి అని, ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి రైతులు హర్షం వ్యక్తచేశారు. మొలకెత్తిన మొక్కలకు నీరు అందించాలనే తపనలో ఉన్న వారికి.. వరుణుడు కురుణించడంతో కొంత ఊరట లభించింది.

విగ్రహ ఏర్పాటుకు అడ్డుపడితే చర్యలు



రోడ్డుపై ధర్నా చేస్తున్న అంబేద్కర్ సంఘం నేతలు

దోమ: అంబేద్కర్ విగ్రహ ఏర్పాటుకు అడ్డుపడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని అంబేద్కర్ సంఘం తాలూకా ఇన్‌చార్జి రమేశ్ కుమార్ హెచ్చరించారు. దోమ మండలం బాస్‌పల్లిలో విగ్రహ ప్రతిష్ఠాపనకు ఏర్పాటు చేసిన దిమ్మెను ఓ వ్యక్తి జేసీబీ సహాయంతో కూల్చివేశాడు. దీంతో సంఘం నేతలు దిమ్మె కూల్చిన వ్యక్తిని నిలదీయగా.. తన స్థలంలో దిమ్మెను ఏర్పాటు చేశారని, తాను నూతనంగా ఇంటి నిర్మాణాన్ని చేపడుతుండడంతో వాస్తు కుదరక తొలంగించాల్సి వచ్చిందని సదరు వ్యక్తి తెలిపారు. దీంతో సంఘం నాయకులు పరిగి–మహబూబ్ నగర్ ప్రధాన రోడ్డుపై బైఠాయించి దిమ్మె కూల్చిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ ధర్నా చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు.. నిరసనకారులకు నచ్చజెప్పి ఆందోళన విరమింప జేశారు. ఈ విషయంపై ఎస్‌ఐ విశ్వజన్‌ను వివరణ కోరగా.. ఇరువురి సమక్షంలో సమస్య సర్దుబాటు అయిందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నేతలు యాదగిరి, జయప్ప, రాములు తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి సహకరించాలి



నూతన కమిటీతో ప్రిన్సిపాల్, కమిటీ సభ్యులు

అనంతగిరి: పాఠశాల, కళాశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు, ఎస్ఎంసీ కమిటీ సభ్యులు సహకరించాలని కొత్తగడి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అపర్ణ కోరారు. శనివారం గురుకుల పాఠశాలలో ఎస్ఎంసీ కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ చైర్మన్‌గా వనమాల, వైస్ చైర్మన్‌గా శివకుమార్‌లతో పాటు మరో 24 మంది సభ్యులను విద్యార్థుల తల్లిదండ్రులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మొన్నటి పదో తరగతి పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు జిల్లాలోనే ఉన్నత స్థానంలో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. నీట్‌లో ముగ్గురు ఎంపిక అయ్యారని పేర్కొన్నారు. పాఠశాల పేరు నిలబెట్టడానికి తనతోపాటు, ఉపాధ్యాయ బృందం ఎనలేని కృషి చేస్తుందని, అందువల్లే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని వెల్లడించారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

అనంతగిరి: తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటర్ పెన్షన్స్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగే సీపీఎస్ రథయాత్ర వాల్ పోస్టర్‌ను శనివారం సీపీఎస్ ఉద్యోగులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అనిల్ మాట్లాడారు. పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర పేరుతో ఈ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు. ఈ నెల 29న యాత్ర వికారాబాద్‌కు చేరుకుంటుందన్నారు. ఆగస్టు 12న చలో హైదరాబాద్ కార్యక్రమం ఉంటుందని, ఈ యాత్రలో ప్రతి సీపీఎస్ ఉద్యోగి పాల్గొనాలని పిలుపునిచ్చారు. నాయకులు నర్సింహులు, మురహరినాథ్, నరేందర్, భాస్కర్, జైపాల్‌రెడ్డి, క్రాంతికుమార్, మల్లేశ్, దినేష్, శ్రీనివాస్, పవన్, నరేష్ పాల్గొన్నారు.

'జిల్లా సాధనకు ఐక్యంగా ఉద్యమిద్దాం'

షాద్‌నగర్: షాద్‌నగర్ జిల్లా కేంద్రం ఏర్పాటు కోసం పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉద్యమించాలని జిల్లా సాధన కమిటీ అధ్యక్షుడు ఎమ్మె సంతోష్ పిలుపునిచ్చారు. జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో శనివారం మండల పరిధిలోని రామేశ్వరంలో లక్ష సంతకాల సేకరణకు ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. షాద్‌నగర్ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నందున జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం కొంగరకొలాన్‌లో ఏర్పాటు చేసిన కలెక్టరేట్ సామాన్యులకు అందుబాటులో లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. జిల్లా సాధన ఉద్యమంలో అన్ని వర్గాల ప్రజల మద్దతు కోరతామన్నారు. కార్యక్రమంలో టెలిఫోన్ వెంకటయ్య, రామచంద్రయ్య, రత్నం, నర్సింహారావు, కాసోజు శివకుమార్, రాజశేఖర్ రెడ్డి, జగన్, నవీన్, నిరంజన్ పాల్గొన్నారు.



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

గుంతల రోడ్లకు మరమ్మతు చేయించండి

బంట్వారం: మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్లన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయని, వాటికి వెంటనే మరమ్మతులు చేయించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బస్వాపూర్ మోహన్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొర్మామిడి టూ కోట్‌పల్లి రోడ్డు పూర్తిగా గుంతలు ఏర్పడిందని, బంట్వారం టూ ఓగులపూర్ గేటు వరకు అదే పరిస్థితి నెలకొందని తెలిపారు. తొర్మామిడి కత్తెర బండ నుంచి మర్పల్లి రోడ్డు ప్రమాదకరంగా మారిందని, వర్షా కాలంలో కనీసం గుంతలనైనా పూడ్చాలని ఆయన కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వేసిన రోడ్ల పై నేటి పాలకులు తట్టెడు మట్టి కూడా వేయించక పోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, లేని యెడలా నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

పీఠాధిపతుల ఆశీస్సులు పొందిన ప్రతినిధులు



ఆశీస్సులు పొందుతున్న సమాజం సభ్యులు

తాండూరు: పీఠాధిపతుల ఆశీస్సులను వీరశైవ సమాజం ప్రతినిధులు పొందారు. పట్టణంలో జరుగుతున్న శ్రీ రాజశ్యామల, సౌర, లక్ష్మీసుదర్శన, శతచండీ, అతిరుద్ర మహాయాగాన్ని శ్రీశైలం పీఠాధిపతి డాక్టర్ 1008 శ్రీచెన్న సిద్ధరామ పండితారాధ్య శివస్వాములు, శ్రీశ్రీశ్రీ ఉజ్జయినీ మహాసంస్థాన పీఠాధిపతి జగద్గురువులు సిద్ధలింగ రాజదేశకేంద్ర శివాచార్యులు సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సమాజం ప్రతినిధులు, యువదళం సభ్యులు పీఠాధిపతులకు పాదపూజ చేసి ఆశీస్సులు పొందారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

చేవెళ్ల: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బాధితులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను శనివారం తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేసి మాట్లాడారు. ప్రత్యేక రాష్ట్రంలో సీఎం కేసీఆర్ పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తున్నారని వివరించారు. నియోజకవర్గ పరిధిలో 70 మందికి రూ.33.62 లక్షలు మంజూరయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీలు గోవిందమ్మ, నక్షత్రం, జెడ్పీటీసీ సభ్యుడు శ్రీకాంత్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు ప్రవీణ్, నర్సింగ్‌రావు, మహేందర్‌రెడ్డి, తోట చంద్రశేఖర్, నరేందర్, బి.నర్సింలు, వెంకటేశ్, మహేశ్, వాసుదేవ్‌కన్న, రమేశ్, గని పాల్గొన్నారు.

పోటీ పరీక్షలతో ప్రతిభ వెలికితీత

చేవెళ్ల: పోటీ పరీక్షలతో విద్యార్థుల ప్రతిభ వెలికితీయవచ్చునని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ నేత సున్నపు వసంతం అన్నారు. మండల కేంద్రంలోని శ్రీచైతన్య జూనియర్, డిగ్రీ కళాశాలలో రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్‌పోటీలపై విద్యార్థులకు అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్లు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్విజ్ పోటీలలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రతిభను చాటుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు ఆదివారం ఆఖరు తేది అని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, చేవెళ్ల గ్రామ కమిటీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్, నియోజకవర్గం యూత్ ప్రధాన కార్యదర్శి సుకాంత్, అభి, కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.